
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం




నేటి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం ఈనెల 20న (సోమవారం) దీపావళి పండగ సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ప్రకటించారు. ఆపై సోమవారం నుంచి పిజిఆర్ఎస్ యధావిధిగా జరుగుతుందని తెలిపారు. ఈ వారం పిజిఆర్ఎస్ రద్దు విషయాన్ని అర్జీదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

సీతంపేట: దీపావళి సందర్భంగా సీతంపేట ఐటిడిఎలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలంతా గమనించాలని పీవో కోరారు.



పేలుడుకు గాయపడ్డ సుందరరావు

ఉలిక్కిపడ్డ పార్వతీపురం

- ఆర్‌టిసి పార్సిల్ సెంటర్ వద్ద బాణసంచా పేలుడు
- ఫ్యాన్సీ వస్తువుల ముసుగులో దీపావళి సామగ్రి
- నలుగురికి తీవ్ర గాయాలు
- ఎస్‌పి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన్యం జిల్లా ప్రధాన కేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రశాంతంగా ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో బాంబు పేలుడు శబ్దం వినిపించింది. కళ్లు తెరిచి చూసే లోగా ఆర్టీసీ కొరియర్ సర్వీస్ కౌంటర్‌కు సమీపాన రక్తస్రావంతో నలుగురు వ్యక్తులు చల్లా చెదురై కనిపించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం నుండి పార్వతీపురం వరకు ఫాన్సీ సామాన్ల ముసుగులో బుకింగ్ అయిన పార్సెల్ బాక్స్‌ను ఆర్టీసీ కళాసీలు అందుకున్నారు. బస్సులో నుంచి తీసుకువచ్చి సర్వీస్ సెంటర్ ముందు భాగంలో దించగానే బాణసంచా పేలుడు జరిగింది. ఈ పేలుడు ధాటికి సర్వీస్ కౌంటర్ ముందర భాగంలో ఉన్న రేకులు, కిటికీ అద్దాలు చిద్రమైయ్యాయి. ఈ సంఘటనలో బెలగాంకు చెందిన ఆర్టీసీ కళాసీ రెడ్డి రమేష్ (38)తో పాటు, నర్సిపురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ తెర్లి రవి (53), తోపుడు బండి కార్మికుడు బోనెల సుందరరావు, అదే సమయంలో పార్శిల్ సెంటర్ కి వచ్చిన పట్టణానికి చెందిన కింతల రమేష్ (48) అనే వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పట్టణ సిఐ మురళీధర్, ఎస్సై గోవిందరావు, ట్రాఫిక్ పోలీసులు, ఫైర్స్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని సంఘటన వివరాలను సంబంధిత కార్గో పార్శిల్ కొరియర్ సర్వీస్ సిబ్బందిని విచారించారు.

విజయనగరం నుండి కొత్తకోట కిషోర్ అనే వ్యక్తి పేరిట పార్శిల్‌ను బుక్ చేశారు. విజయనగరంలో నెల్లి సాంబ అనే వ్యక్తి పార్శిల్‌ను బుక్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రతి పార్సిల్‌ను సిబ్బంది పరిశీలించకపోవడంపై ఆయన ఆగ్రహించారు. ఘటన బస్సులో జరిగితే ఎంత ప్రాణాపాయం జరిగేదన్నారు. తీవ్రంగా గాయపడిన కింతల రమేష్, తెర్లి రవిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. రెడ్డి రమేష్‌ను విజయనగరం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాని జిల్లా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దర్యాప్తు జరిపి నిత్యం ప్రజలు ప్రయాణించే బస్సులో పార్సిల్ సర్వీసు ద్వారా నిషేధిత మందు గుండు సామాగ్రి బుక్ చేసిన వారిని కనిపెట్టి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిషేధిత మందుగుండు సామగ్రి బుక్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయనగరానికి చెందిన కిశోర్, కురుపాంకు చెందిన కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఆర్టీసి బస్సులో ఈ పేలుడు జరిగి ఉంటే ప్రాణనష్టం ఎక్కువగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కింతల రమేష్



తెర్లి రవి



రెడ్డి రమేష్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజలంతా ఆనందాల దీపావళి జరుపుకోవాలని కోరుతూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు. ఈ శుభ సందర్భం జిల్లాలోని ప్రతి ఇంట్లో సంతోషాన్ని, సంపదను, సుఖశాంతులను నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, శబ్ద, వాయు కాలుష్యం తక్కువగా ఉండే గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు.



CERTIFICATE OF RECOGNITION

This Certificate of Recognition is proudly presented to

PARVATHIPURAM MANYAM, ANDHRA PRADESH

in recognition of Outstanding Performance and Exemplary Contribution as the Best Performing District under the initiatives of Adi Karmayogi Abhiyan.

The dedication and commitment displayed towards advancing Tribal Welfare, Empowerment, and Inclusive Development are deeply appreciated.

17th October, 2025

NEW DELHI

VIBHU NAYAR
Secretary
Ministry of Tribal Affairs, Government of India

కలెక్టరుకు ప్రతిష్టాత్మక పురస్కారం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆది కర్మయోగిలో వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టడం, ప్రత్యేక చొరవ చూపినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. గిరిజన సంక్షేమ, సాధికారత, సమ్మిళిత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినందుకు ఉత్తమ ప్రదర్శన అవార్డుకు జిల్లా ఎంపిక కావడం జిల్లా వాసుల గర్వకారణం. జిల్లా పరిపాలనలో పలు విభాగాల్లో కలెక్టర్ చేపట్టిన వినూత్న చర్యలు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో పాలన, విద్య, ఆరోగ్య రంగాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, పౌర సౌకర్యాల అభివృద్ధి వంటి రంగాల్లో అత్యుత్తమ పనితీరు, ఆదర్శప్రాయమైన సహకారం ప్రశంసనీయమని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఈ పురస్కారాన్ని అందించింది.

మన్యంలో పర్యాటకాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

మన్యం జిల్లాలో విశేషమైన ప్రకృతి అందాలకు నిలయంగా ఉందని, ఈ ప్రాంతంలో ఉండే వాటర్ ఫాల్స్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేసే దిశగా తగు చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని కొడమ పంచాయతీ పరిధిలో గల లొద్ద గ్రామం వద్ద గల జలపాతాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లొద్ద గ్రామ గిరిజనులతో కలెక్టర్ మమేకమయ్యారు. గ్రామంలో ఉన్న ప్రతి గిరిజన కుటుంబాన్ని సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలేని వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్న ఆయన గిరిజనులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. లొద్ద జలపాతానికి పర్యాటకులు విచ్చేసేలా మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఇటువంటి సుందరమైన ప్రాంతానికి పర్యాటకుల తాకిడితో సందడిగా మారాలని, పర్యాటక ప్రాంత అభివృద్ధిలో స్థానిక గిరిజన యువత పాలుపంచుకోవాలని, పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పించేందుకు స్థానిక గిరిజనులతో కలిసి తగు కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జిపిపి ప్రసూన, తహశీల్దార్ నీలకంఠరారు ఫారెస్ట్ రేంజర్ కె.తవిటి నాయుడు, ఎపిడిఒ గొల్లపల్లి పార్వతి, ఎపిఒ రామకృష్ణ నాయుడు, సాలూరు రూరల్ ఎస్సై నరసింహమూర్తి, ఎపిఎం జయమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



లొద్ద గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన బిడ్డిక హర్షవర్ధన్, జియమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి పాఠశాలకు చెందిన నిమ్మల జితేంద్ర, జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17న విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల ఫెన్సింగ్ సెలక్షన్ ట్రయిల్స్‌లో నిమ్మల జితేంద్ర, బిడ్డిక హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18న కాకినాడ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన 12వ సబ్ జూనియర్ అంతర జిల్లా బాల, బాలికల ఫెన్సింగ్ ఫోయిల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. కోచ్ బాలరాజు, హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, ఆర్.వెంకటరమణ, పిడి మాధవరావు, తల్లిదండ్రులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

ముసురు పట్టిన మన్యం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీకి ముసురు పట్టింది. మన్యంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమై బురదమయంగా మారాయి. ప్రయాణికులు, ఫుట్ పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రతి ఏటా దీపావళికి ముందు వర్షం కురవడం ఆనవాయితీగా వస్తుంది.

వీరఘట్టం : మండలంలోని ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గగ్గోలు పెడుతున్న క్యాబేజీ రైతులు

ఆదివారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పంట నాశనమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని క్యాబేజి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, కుటుంబ సమేతంగా ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందవచ్చే తరుణంలో వర్షం ప్రభావంతో కాయ కష్టమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో మంచు ఎంత విస్తారంగా కురిస్తే పువ్వు కూడా పెద్దగా అవుతుందని, వర్షం వల్ల క్యాబేజీ పువ్వు కుళ్లిపోయే అవకాశలు ఉన్నాయని, ఇదే కొనసాగితే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని రైతులు నాగభూషణరావు, గణపతి, ప్రభ, శ్రీరాములు, త్రినాధ, శంకర్రావు, అప్పడు, కైలాష్ రావు, పరస ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకొండ: మండలం, పట్టణంలో ఆదివారం ఏకధాటిగా వర్షం కురుస్తుంది. దీంతో జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్, నాగవంశవీధి, గాయత్రి నగర్, గారమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది.

సీతంపేట మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ప్రజలకు కొంత ఆటంకం కలిగింది.

సంస్కారం లేని మంత్రి సంధ్యారాణి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సంస్కారం, ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సిఎంగా పనిచేసిన తనను, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిను ఏకవచనంతో సంబోధిస్తూ ఆమె మాట్లాడిన తీరుపై రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా, వందల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై రాష్ట్రంలో సిఎం, మంత్రులు గాడిదలు కాస్తున్నారా అని మాజీ సిఎం జగన్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని అన్నారు. మరణించిన ఇద్దరు గిరిజన విద్యార్థినుల కుటుంబాలకు మట్టి ఖర్చులకు ఐదు వేలు ఇచ్చామని మంత్రి సంధ్యారాణి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.50లక్షలు పరిహారం చెల్లించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తూ రిలే దీక్షలు చేపడుతున్నాయని చెప్పారు. గురుకుల విద్యార్థులు మరణించినప్పుడు మంత్రి సంధ్యారాణి స్థానికంగా ఉన్నప్పటికీ పరామర్శించక పోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల మరణాలకు, అస్వస్థతకు ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం సరికాదని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించి ఫైలు పై తొలి సంతకం చేశానని గొప్పలు చెప్పుకున్న మంత్రి ఎందుకు అమలు చేయలేదన్నారు. అబద్ధాలు తప్ప నిజాలు ఆమె మాట్లాడడం లేదన్నారు. తన ఇంటి ముందు రోడ్డు వైసిపి ప్రభుత్వం హయాంలో మంజూరైతే టిడిపి ప్రభుత్వం హయాంలో పని జరిగిందని చెప్పారు. ఇప్పటికీ ఆ కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరు చేయలేదని ఎద్దేవా చేశారు. సంధ్యారాణి సొంత ఊరు కవిరిపిల్లికి రోడ్డు తానే మంజూరు చేయించానని చెప్పారు. మక్కువ రోడ్డు పని రెండు నెలల్లో చేయిస్తానని చెప్పిన మంత్రి 15నెలలైనా చేయలేదన్నారు.

నూరు శాతం గిరిజన రక్తం ఆమెలో లేదు

మంత్రి సంధ్యారాణిలో నూరు శాతం గిరిజన రక్తం లేనందునే ఆమె గిరిజన చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. కరాసువలస కెజిబివి ఎస్ఒ ప్రశాంతి నిరుపేద పిటిజి గిరిజన మహిళని, అలాంటి ఉద్యోగిని కక్ష కట్టి సస్పెండ్ చేయించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి చిరుద్యోగులను పదుల సంఖ్యలో ఆమె సిఫార్సు లతో అధికారులు తొలగించారని చెప్పారు.

రాష్ట్ర చరిత్రలో ప్రథమం

గిరిజన సంక్షేమ శాఖ చరిత్రలో ఇద్దరు విద్యార్థినుల మరణం, 200 మంది విద్యార్థినుల అస్వస్థతకు గురికావడం వల్ల కురుపాం గురుకుల పాఠశాలను మూసివేయడం మొదటిసారి అన్నారు. మంత్రి సొంత నియోజకవర్గం లోనే పదిరోజుల వ్యవధిలో ముగ్గురు గిరిజన విద్యార్థులు మరణించారని తెలిపారు. మానవత్వంతో వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం అందజేశారని చెప్పారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన రాకపోవడంతో తాము జాతీయ ఎస్టీ కమిషన్, మానవహక్కుల కమిషన్ లకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకొచ్చామని,వాటి నిర్మాణానికి నిధులు మంజూరు అనేది ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా చేయాల్సిందేనని చెప్పారు. సంధ్యారాణి వంటి వ్యక్తి మంత్రిగా ఎంతకాలం వుంటే వైసిపికి అంత మేలు జరుగుతుందని రాజన్నదొర జోస్యం చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా ప్రచార విభాగం కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు కాకి రంగా, ఎంఎస్ నారాయణ, ఎం.అప్పారావు, జి.వెంకటరమణ, కె.రామకష్ణ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోయేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోయేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పార్వతీపురం జిల్లా యునిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికైంది. ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉత్తర్వులు మేరకు ఎన్నికల, సహాయ ఎన్నికల అధికారులుగా శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీరాములు, బివివిఎన్ రాజు, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.బంగారాజు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులు : అధ్యక్షులుగా గొట్టాపు శ్రీరామమూర్తి (పర్యవేక్షకులు, ఇ.ఎఫ్.జి. సెక్షన్, కలక్టరు కార్యాలయం), సహాధ్యక్షులుగా సిహెచ్ రాధాకృష్ణ మూర్తి (తహశీల్దార్, పాలకొండ), ఉపాధ్యక్షులుగా ఎన్.శివన్నారాయణ (తహశీల్దార్, భామిని), పి.చిట్టెమ్మ (రీ-సర్వే ఉప తహశీల్దార్ సీతానగరం), ఎన్.శ్రీనుబాబు (ఆర్ఐ, సీతానగరం), ఎస్.వెంకటేష్ (సీనియర్ సహాయకులు, సబ్ కలక్టరు వారి కార్యాలయం, పాలకొండ), కార్యదర్శిగా ఎ.సాయి కామేశ్వర రావు (తహశీల్దార్, వీరఘట్టం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.శ్రీనివాస రావు (ఉప తహశీల్దార్, బలిజిపేట) క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.శివరామకృష్ణ (ఆర్ఐ, గుమ్మలక్ష్మీపురం), సంయుక్త కార్యదర్శులుగా బి.శివ జగన్మోహన్ (రీ-సర్వే ఉప తహశీల్దార్, జియ్యమ్మవలస), జి.హేమలత (రీ-సర్వే ఉప తహసిల్దార్, పాచిపెంట), పి.కరుణాకర్ (సీనియర్ సహాయకులు, కలెక్టరు కార్యాలయం, పార్వతీపురం), జి.నాగేంద్ర ప్రసాద్ (ఆఫీస్ సబార్డినేట్, పార్వతీపురం), కోశాధికారిగా పి.సత్య లక్ష్మి కుమార్ (పర్యవేక్షకులు, సి.సెక్షన్, కలెక్టరు కార్యాలయం, పార్వతీపురం), ఇసి మెంబర్లుగా పిఎల్‌వి ప్రసాదరావు (సీనియర్ సహాయకులు, కలెక్టరు వారి కార్యాలయం, పార్వతీపురం), వి.ధర్మ తేజ, ఎన్నికయ్యారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎర్ర సామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్ జి హర్షవర్ధన్ ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్ స్థితిగతులపైన ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు, ఇటీవల ఆశ్రమ పాఠశాల విద్యార్థి టి.చిన్నారి మరణంపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి సంబంధిత నివేదిక ఫైల్ చేయమని విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వెరిఫై చేసి రిపోర్టు పంపించాలని ఆదేశించింది. స్థానిక స్థితిగతులపైన రిపోర్ట్ చేయడానికి ఆదివారం చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సాలూరు జి.హర్షవర్ధన్ ఎర్రసామంత వలస ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఇటీవల జరిగిన అంశాల పైన రిపోర్టును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిక్ రూమ్, గోదాము, వంటగదిని పరిశీలించారు. అక్కడ ఉన్న పాడైపోయిన కూరగాయలు టమాటో, బంగాళదుంపలను చూసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం చాలాకాలంగా పనిచేయకుండా ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి దాని గుత్తేదారు ఎవరు, ఎప్పుడెప్పుడు ఫిర్యాదులు రిజిస్టర్ చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఎస్ఐరాజారావు, కానిస్టేబుల్ శేఖర్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నాసిరకం కూరగాయలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్జి హర్షవర్ధన్

జిల్లాలో కల్తీ మద్యం లేదు

- సురక్ష యాప్ ద్వారా అక్రమార్కులకు చెక్
- బెల్టుషాపులను ఉపేక్షించం
- నెలకు సగటున రూ.4.8 కోట్ల విక్రయాలు
- 'ప్రజాశక్తి'తో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ముఖాముఖి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో కల్తీ మద్యం అనే ప్రసక్తే లేదని ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు స్పష్టంచేశారు. సురక్ష యాప్ ద్వారా అక్రమార్కులకు చెక్ పెడుతున్నామని చెప్పారు. కల్తీ మద్యం అనేది కేవలం అసత్య ప్రచారమని తెలిపారు. మద్యం బెల్ట్‌షాపులను కూడా ఉపేక్షించేది లేదన్నారు. ఇందుకనుగుణంగా ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు కూడా ఉన్నాయని వివరించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నెలకు సగటును రూ.4.8 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఇది ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువేనని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి శ్రీనాథుడు ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లా కల్తీ మద్యం ఉన్నట్టు జరుగుతున్న ప్రచారంపై మీరేమంటారు.?

జిల్లాలో కల్తీ మద్యం అనే ప్రసక్తే లేదు. ఇది పూర్తిగా అసత్య ప్రచారం. ఈ రకమైన ప్రచారం వినిపించాక జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాం. ఎక్కడా అటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. ఎవరైనా కల్తీ మద్యాన్ని గుర్తిస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం. ఆయా బాటిళ్ల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవడానికి మేం నిరంతరం సిద్ధంగా ఉంటాం.

కల్తీ మద్యాన్ని ఎలా నిర్ధారిస్తారు.?

కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు ఎపి ఎక్సైజ్ సురక్ష అనే యాప్‌ను కూడా ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు గానీ, రిటైల్ దుకాణదారులు గానీ ఎక్కడైనా, ఎప్పుడైనా పరిశీలించుకోవచ్చు. మద్యం బాటిల్ ధరతోపాటు ఎక్కడ? ఎప్పుడు తయారైంది? బ్యాచ్ నెంబర్ తదితరాలన్నీ ఉంటాయి. యాప్ ద్వారా స్కాన్ చేయగానే తెలిసిపోతుంది. వెంటనే సమీపంలోని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అయితే, ఈ యాప్ లిక్కర్‌కు మాత్రమే పరిమితం. బీర్ బాటిల్స్‌కు ఇది ఉపయోగపడదు.

కల్తీ మద్యం ప్రచారం నేపథ్యంలో మీరు తీసుకుంటున్న చర్యలేమిటి.?

కల్తీ మద్యం అనే ప్రచారం ఉనికిలోకి రావడంతో గడిచిన పది రోజులుగా అన్ని దుకాణాలపైనా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎక్కడా అటువంటి మద్యం దొరక లేదు. ఒకవేళ అటువంటి మద్యం దొరికితే విక్రయించిన వారిపై, తయారీదారులపైనా కఠిన చర్యలు ఉంటాయి.

బీరులో కల్తీ జరిగితే పరిస్థితి ఏమిటి.?

బీరు బాటిళ్లు ఎక్కువ సమయం ఫ్రిజ్‌లలో కూలింగ్ అవుతూ ఉంటాయి. కాబట్టి ఆయా లేబుళ్లు చెరిగిపోయే అవకాశం ఉంటుంది. స్కాన్ చేయడం కూడా కష్టతరంగా ఉంటుంది. అందువల్ల ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌లో బీరు బాటిల్స్‌కి మినహాయింపు. భవిష్యత్తులో వీటికి కూడా యాప్ తయారు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. మా శాఖ ఆధ్వర్యాన ఇటువంటి కసరత్తు కూడా ప్రారంభమైంది.



బెల్ట్ షాపుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ప్రస్తుతం దాడులు ముమ్మరం చేశాం. బెల్ట్‌షాపులు నడుపుకోవడానికి అనుగుణంగా మద్యం విక్రయించవద్దంటూ రిటైల్ (ఎ4) దుకాణదారులకు ఆదేశాలు జారీచేశాం. అవసరమనుకున్న చోట్ల ఆయా దుకాణాల యజమానుల నుంచి పూచీకత్తులు కూడా తీసుకుంటున్నాం. మరోవైపు ఇప్పటికే బెల్ట్‌షాపుల నిర్వహించిన వారిని బైండోవర్ చేస్తున్నాం. అప్పటికీ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించేందుకు కూడా వెనుకాడేది లేదు. ఇందుకనుగుణంగా శాఖాపరమైన ఆదేశాలు స్పష్టంగానే ఉన్నాయి.

జిల్లా వాప్తంగా ఎన్ని దుకాణాలు ఉన్నాయి.?

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 225 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో విజయనగరం జిల్లాకు సంబంధించి 169, మన్యం జిల్లాలో 56 దుకాణాలు ఉన్నాయి. వీటిపై నిరంతర పర్యవేక్షణ ఉంటోంది. క్రయ, విక్రయాలు, వాటిలో నాణ్యతా ప్రమాణాలు, స్టాకు, రికార్డుల నిర్వహణ తదితరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

మద్యం విక్రయాలు ఎలా ఉన్నాయి.?

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నెలకు సరాసరి రూ.4.8 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే కాస్త తక్కువగానే ఉంది. పండగలు, ప్రత్యేక అకేషన్లు ఉన్నప్పుడు విక్రయాలు కాస్త పెరుగుతున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

200 రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఒక్క పూట ఉపాధి పనులు నిర్వహించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బల్ల కృష్ణాపురంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ బోగిల పాపయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం కార్యదర్శి చందనపల్లి కృష్ణ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి చౌక దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, నూనె, పప్పులు, ఇతర నిత్యవసర సరుకులు సరఫరా చేయాలని, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని ఇలా అనేక పోరాటాలు వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తుందన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పార్వతీపురంలో ఈనెల 22న పార్వతీపురంలో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా బోగిల పాపయ్య, కార్యదర్శిగా చందనపల్లి కృష్ణ, మండల కమిటీ సభ్యులుగా నక్క త్రినాథ్, పి.చిన్నారావు, ఎ.ంగారాజు, బి.నారాయణ స్వామి, జి.మాలతి, యామలపల్లి సింహాచలంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకున్నామని స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఈ ఏడాది 16 వేల ఎకరాల్లో 9,900చిన్న, సన్నకారు రైతులు వరి పంట సాగు చేశారని ఆమె అన్నారు. 7,900మంది రైతుల ఇ-క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన 2వేల మంది రైతుల వివరాలను ఈనెల 25లోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

నవంబర్ నెలాఖరికి వంతెన ప్రారంభం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

దీర్ఘకాలం పెండింగ్లో ఉన్న సీతానగరం కొత్త వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, నవంబర్ నెలాఖరుకు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. ఆదివారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన వివిధ ప్రాజెక్టుల పనులన్నీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేస్తున్నామని, అందులో భాగంగానే సీతానగరం వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసింది అప్పటి తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వ ఐదేళ్లలో ఒక్క చిన్న పని కూడా చేసిన దాఖలాలేవన్నారు. ఈ బ్రిడ్జి పనులు ఈ పాటికే పూర్తి కావాల్సి ఉందని, వర్షాభావ పరిస్థితుల వల్ల పనులు జరగడంలో జాప్యం జరిగిందని, నవంబర్ నెలాఖరుకు ఈ వంతెన పూర్తి కావస్తుందని, ఆ దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే పెదంకలాం నుంచి బూర్జకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టామని, దీనికి ఆరు కోట్ల రూపాయలతో నిర్మించేందుకు అనుమతులు వచ్చాయని, ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఏ గ్రామానికి అయితే రోడ్డు, కాలువ లేదో ఆ గ్రామాలను గుర్తించి పూర్తిస్థాయిలో రోడ్లు, కాలువలు, చిన్నచిన్న వంతెనలు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఊరించి చివరకు ఉసూరు మనిపించారని, ఉద్యోగులకు దీపావళి బొనాంజా అంటూ హడావుడి చేసిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీసం ఇవ్వాల్సిన డిఎ బకాయిలు, ఇతర బకాయిలు ఇవ్వకుండానే కేవలం ఒక డిఎతోనే సరిపుచ్చడం సరి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 జులై నాటికి ఇవ్వాల్సిన 4 డిఎ బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక, ఉద్యోగ వర్గాలకు వ్యతిరేకంగా పాలన సాగుతుందని, ఈ విధానాలను విడనాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్‌సి ఇస్తామని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామన్న హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలోని 4,5,7 వార్డుల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం కోటి సంతకాల సేకరణను ప్రారంభించారు. విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు వచ్చి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మథరావు, పాలవలస ధవళేశ్వర్ రావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, కిల్లారి మోహన్, కోడెం బాబీ, తూముల లక్ష్మణ రావు, పల్లా భాను, నీలాపు శ్రీను స్వామి, దుంపల రమేష్(చిన్ని), బుక్కూరు దుర్గారావు, పల్లి లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటకు చెందిన టిడిపి కార్యకర్త అంబటి సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం అప్పయ్యపేటలో జరిగిన సుధాకర్ పెద్దకర్మకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పాల్గొని సుధాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సుధాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్ పేట, కురుపాం ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన దీపావళి టపాసులు షాపును తహశీల్దార్ ఎన్.శేఖర్ ఆదివారం పరిశీలించారు. మతాబుల అమ్మకాలు ప్రాంతం వద్ద తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరామకృష్ణ ఉన్నారు.


దుకాణాలను సందర్శించిన ఎస్సై

కురుపాం : దీపావళి సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణల లైసెన్సులు, అన్ని పర్మిట్లను, సామాగ్రిని క్షుణంగా పరిశీలించారు. అనంతరం దుకాణదారులతో మాట్లాడుతూ అన్ని జాగ్రత్తలు పాటిస్తూ సక్రమంగా అమ్ముకోవాలని సూచించి, దుకాణ పరిసరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మందుగుండు దుకాణాన్ని పరిశీలిస్తున్న కురుపాం ఎస్ఐ నారాయణరావు

ఆనందం.. కారాదు విషాదం



తారాజువ్వలు.. భూచక్రాలు.. వెన్నముద్దలు.. చించుబుడ్డీలు.. షాట్స్.. రాకెట్స్.. థౌజండ్ వాలాలు.. ఇలా మతాబులు కాల్చి దీపావళిని అందరూ సంతోషంగా గడుపుతుంటారు. దీపావళి రోజు సాయంత్రం కాగానే ప్రతి గ్రామంలో, పట్టణంలో అందరూ మతాబులు, బాంబులు, తారాజువ్వలు పేలుస్తుంటారు. దీపావళి అంటే ఇంటిల్లిపాది జరుపుకునే పండగ. అలాంటి పండగ సమయాన ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా తీవ్ర విషాదమే!. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. ప్రమాదాలు జరగకుండా ఈ దీపావళి జరుపుకోవాలని కోరుకుంటూ 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం..

- జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు దూరం
- రేట్లు పెంచేసిన యజమానులు
- షాపుల వద్ద కానరాని ధరల పట్టికలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో పర్మినెంట్ బాణసంచా విక్రయా కేంద్రాలు షాపులు కెవెల్‌పురంలో 10, చీపురుపల్లిలో 2, రాజాంలో 2, బాడంగి, మానాపురంలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మండలాల వారీగా ఫైర్‌స్టేషన్ పరిధిలో తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రతిషాపు వద్ద రక్షణ చర్యలు పాటించేలా అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కెవెల్‌పురంలో ఏర్పాటుచేసిన పర్మినెంట్, తాత్కాలిక షాపుల వద్ద బందోబస్తును డిఎస్‌పి ఆర్.గోవిందరావు, వన్‌టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు పర్యవేక్షించారు. డిఎఫ్ఒ బివిఎస్ రామ్‌ప్రకాశ్, అసిస్టెంట్ ఫైర్ అధికారి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు అగ్నిమాపక శకటాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు.

ముందుగా ఏం చేయాలంటే..

- గుర్తింపు పొందిన బాణసంచా పరిశ్రమలు తయారుచేసిన టపాసులు మాత్రమే కొనాలి.
- పిల్లలకు దగ్గరగా టపాసులు ఉంచకూడదు.
- ఇంటిలో గ్యాస్ సిలిండర్. ఆయిల్ క్యాన్లు లాంటి వాటికి దగ్గరగా ఉంచకూడదు.
- టపాసులతో పిల్లలను ఒంటరిగా అసలు ఆడనీయరాదు

చుక్కలనంటిన పటాసుల ధరలు

దీపావళి పండగకు ఈసారి బాణసంచా కొనేందుకు వెళ్లే వినియోగదారులు వాటి ధరలను చూసి బెంబేలెత్తి పోతున్నారు. గతేడాది కంటే ఈసారి మతాబులపై రెట్టింపు పెంచారని చెబుతున్నారు. గతంలో రూ.300 నుంచి ప్రారంభమయ్యే ఫ్యామిలీ ప్యాక్.. ఈ ఏడాది రూ.వెయ్యి, 1500, 2500కు చేరాయి. మతాబుల రేట్లు నియంత్రించాల్సిన అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి షాపు వద్ద ఏ మతాబు ఎంత ధర అనేది బోర్డులు ఉండాలి. ఏ ఒక్క షాపు వద్ద బోర్డులు కనిపించిన దాఖలాలు లేవు.

కొన్ని మతాబుల ధరలు (రూ..లో)

10,000 వాలా	6000
1000వాలా	450
వెన్నముద్దలు(బాక్స్)	200
రాకెట్లు	300
షాట్స్	100
కాకరపువ్వొత్తులు	500
భూచక్రాలు	250
అగ్గిపెట్టె బాక్సులు	100
చించు బుడ్డీలు	300



విక్రయానికి సిద్ధంగా ఉంచిన టపాసులు

టపాసులు కాల్చేటప్పుడు ఏం చేయాలి?

- టపాసులను ఓపెన్ ఏరియాలో మాత్రమే కాల్చాలి.
- బాగా వదులుగా ఉన్న నూలు వస్త్రాలు ధరించాలి.
- టపాసులు వెలిగించటానికి క్యాండిల్ లేదంటే అగరబత్తి లాంటిది దగ్గర ఉంచుకోవాలి.
- రెండు బకెట్ల నీరు దగ్గరలో ఉంచుకోవటం మంచిది.
- చేతిలో ఉంచుకుని టపాసులు అంటించే ప్రయత్నం చేయకూడదు.
- అంటించి వచ్చిన వెంటనే కొన్ని టపాసులు వెంటనే పేలవు. అలాంటప్పుడు ఏమైందోనంటూ వాటిని పరిశీలించే ప్రయత్నం వెంటనే చేయకూడదు.
- అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ నీళ్లు పోసి ఆర్పే ప్రయత్నం చేయాలి.
- పెద్దగా ఒళ్లు కాలినప్పుడు బాధితుడిని శుభ్రమైన బెడ్‌షీట్‌లో చుట్టి వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలి.

అగ్నిమాపక నిబంధనలు పాటించాలి

దీపావళి పండగకు ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రతి షాపు యజమాని అగ్నిమాపక నిబంధనలు పాటించేలా ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో 16 పర్మినెంట్ షాపులు, మండలాల వారీగా తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రతిఒక్కరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలి.

- బి.వి.ఎస్.రామ్‌ప్రకాశ్,
జిల్లా అగ్ని మాపక అధికారి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

వ్యాధులపై అవగాహన

విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలపై అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. పట్టణంలోని బెలగాంలో గల గిరిజన సంక్షేమ హాస్టల్‌ను ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావుతో కలిసి ఆదివారం సందర్శించారు. హాస్టల్ వసతులు, పరిశుభ్రత పరిశీలించారు. విద్యార్థుల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఉన్నారా అని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్ నిర్వహణ, తాగునీటి సదుపాయంపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు, కామెర్లపై అవగాహన కల్పించే కరపత్రాలను అందజేశారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అనంతరం పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. చేతులను తరచుగా పరిశుభ్రం చేసుకోవాలని, పరిశుభ్రమైన నీరు నిర్ణీత వ్యవధిలో తాగాలని తెలిపారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి వారం వేయించాలని సిబ్బందికి సూచించారు. కిచెన్, మరుగుదొడ్లు, హాస్టల్ ప్రాంగణం రోజూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల్లో ఏ చిన్న అనారోగ్య లక్షణాలున్నట్లు గుర్తించినా తక్షణమే పరీక్షలు చేయించి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీహరి, సిసి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

గిరిజనుల ఆరాధ్యం జాకరమ్మ

గుమ్మలక్ష్మీపురం : ఏజెన్సీలో ప్రాంతంలో గిరిజనులు తరతరాల నుంచి జాకరమ్మ దేవతను ఆరాధ్య దైవంగా భావించి పూజలు చేస్తుంటారు. అడవినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమను చల్లగా చూడాలని, వ్యవసాయ పంటలు బాగా పండి సిరిసంపదలు ప్రతి ఇంటా నిండాలని, పిల్లాపాపలతో ఆరోగ్యంగా ఉండాలని వేడుకుంటారు. మొగనాలి గెడ్డ పర్యాటక ప్రాంతం వద్ద గిరిజనులు జాకరమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

గుమ్మడి గింజంతైనా నిజం మాట్లాడవా సంధ్యారాణి? :పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అజ్ఞాతంతో మాట్లాడి ఉన్న పరువు తీసుకోవద్దని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి హెచ్చరించారు. చిన మేరంగిలో గల తన క్యాంపు కార్యాలయంలో పుష్పశ్రీవాణి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ కురుపాంలో ఇద్దరు గిరిజన విద్యార్థులు చనిపోయారని, 11మంది చనిపోయారని వైసిపి నాయకులు చెప్పడం అబద్ధమని ఖండిస్తూ పత్రిక ముఖంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి కనీస అవగాహన లేకుండా అజ్ఞానంతో మాట్లాడడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ ఆశ్రమ పాఠశాలల్లో 11 మంది విద్యార్థులు దుర్మరణం పాలైతే ఈ తప్పును ఒప్పుకోలేక మంత్రి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. అలాగే వైసిపి హయాంలో 118 మంది విద్యార్థులు మృతి చెందారని చెప్పడం దురదష్టకరమన్నారు. ఆ 118 మంది పేర్లు, ఎక్కడ, ఎప్పుడు, ఏ కారణంగా, ఏ సంవత్సరమో ఆధారాలతో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఇద్దరు గిరిజన పిల్లలు పచ్చకామర్లతో మృతి చెందగా, మరో 200 మందికి పైగా పచ్చకామెర్ల లక్షణాలతో బాధపడుతున్నా బాధ్యతారహితంగా వ్యవహరించి, 5రోజుల తర్వాత మాట్లాడడంపై గిరిజనులంతా తిట్టిపోస్తున్నారని అన్నారు. కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలను నిర్మాణ పనులు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఒక్క ఇటుకను కూడా కదల్చలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం ఐటిడిఎలను నిర్వీర్యం చేశారని ఆరోపించడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసలు ఐటిడిఎ నిర్వీర్యమంటే ఏమిటో తెలుసా అని ఆమె ఎదురు ప్రశ్న వేశారు. నిర్వీర్యమైతే సమావేశాలు, సమీక్షలు ఎలా జరిగాయన్నారు. మీ అవినీతి చిట్టాను సిద్ధం చేస్తున్నామని, గురుకులం, ఏకలవ్య పాఠశాలలో నీట్‌లో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని, కంప్యూటర్ లేకుండా క్లాసులు ఎలా పూర్తి చేశారో ఆధారాలతో సహా సెక్రటరీకి అందజేస్తామని హెచ్చరించారు. మంత్రిగా పదవి చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఎంతెంత ఎక్కడెక్కడ అవినీతికి పాల్పడ్డారో అవన్నీ బయటపెడతామని హెచ్చరించారు.

అంధకారంలో ఆర్‌టిసి కాంప్లెక్స్

పట్టించుకునే నాథుడే కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీకి కేంద్ర బిందువుగా ఉన్న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యల పరిష్కారం లేదు సరి కదా? రాత్రివేళ బస్సుల కోసం వేచి ఉండడానికి రక్షణే లేకుండా పోయింది. కాంప్లెక్స్‌లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో గాఢాంధకారం నెలకొంది. మూడు రోజులుగా విద్యుత్ వెలుగులు లేక బస్సుల కోసం ఎక్కడ వేచి ఉండాలో ప్రయాణికులకు తెలియని పరిస్థితి. మరి ఇంత నిర్లక్ష్యమా అన్న ప్రశ్న వినిపిస్తోంది. రాత్రివేళ విద్యుత్ దీపాలు వెలగక కటిక చీకటితో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సరఫరా నిలిచి పోయిందని ఆర్‌టిసి అధికారులు అంటున్నారు. కాంప్లెక్స్‌లో సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ స్థానిక సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు వేడుకున్నా స్పందన మాత్రం అంతంత మాత్రమే. షాపుల నిర్వహణతో నెలకు వేలాది రూపాయలు అద్దె వస్తున్నా కాంప్లెక్స్‌లో సౌకర్యాలు మెరుగుపర్చడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విద్యుత్ దీపాల్లేక అంధకారంలో ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్

ఇలా అయితే రాకపోకలు సాగేది ఎలా?

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని కిమ్మి - కొట్టుగుమ్మడ గ్రామాల మధ్య మొదటి బ్రాంచి కాల్వ పక్కన ఉన్న రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగేదే ఎలా అంటూ స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి గతంలో ఉపాధిహామీ చట్టం ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, నిధులు వృథా తప్ప ఫలితం శూన్యమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో పంటను పొలాల నుంచి కల్లాలకు ఎలా చేరవేయాలో అర్థం కావడం లేదన్నారు. కిమ్మి నుంచి కొట్టుగుమ్మడకు తక్కువ సమయంతో అటు ఇటు రాకపోకలు సాగించేందుకు రహదారి ఎంతో వీలుంటుందన్నారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కిమ్మి-కొట్టుగుమ్మడ రోడ్డు

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలు ఉన్నాయనిచ వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి

ఉద్యోగుల డిమాండ్లపై సిఎం స్పందన హర్షణీయం

ఎపిఎన్‌జిఒల సంఘం జిల్లా అధ్యక్షులు కిశోర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపై సిఎం చంద్రబాబు నాయుడు స్పందన హర్షణీయమనీ ఎపి ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు జివిఆర్ఎస్ కిశోర్ అన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక డిఎ విడుదల చేయడం, 60రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టిసి ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన చర్చలు జరగడం సంతోషదాయకమని వారు పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై సిఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50వేలు నుంచి రూ.లక్షకు పెంచడం, ఉద్యోగుల కంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగ్‌ను రూ.2 లక్షల నుంచి రూ. 5లక్షలకు పైబడేలా పెంచడం, అలాగే ఆరోగ్యశ్రీ విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించిందన్నారు. ఇవన్నీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలుగా పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు, ఎన్‌జిఒ హోమ్‌లను గతంలో మాదిరిగానే ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, అలాగే చెల్లించాల్సిన బకాయిలను రద్దు చేయడం కూడా హర్షణీయమని తెలిపారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఎపి జెఎసి అధ్యక్షులు విద్యాసాగర్ , ప్రధాన కార్యదర్శి డివి రమణకు ఉద్యోగ సంఘాల తరపున అభినందనలు తెలిపారు. పిఆర్‌సి కమిటీ ఏర్పాటులోనూ, 57వ మెమో ప్రకారం సుమారు 11,000 మంది ఉద్యోగులను ఒపిఎస్ పద్ధతిలోకి తీసుకురావాలని సిఎం స్వయంగా ప్రకటించడాన్ని కూడా జెఎసి హర్షించిందని, మిగిలిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ వార్డు సచివాలయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారానికి విద్యాసాగర్, రమణ నాయకత్వంలో ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్, ఎపి జెఎసి నిరంతరం కృషి చేస్తుందని కిశోర్ తెలిపారు.

పేలుడు పదార్థాలకు దూరంగా ఉండండి : సిఐ

ప్రజాశక్తి - సాలూరు

దీపావళి రోజున ప్రతి ఒక్కరూ కుటుంబాలతో కలిసి ఆనందంగా గడుపుకోవాలని పేలుడు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీకూడలిలో పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దీపావళి పండుగ ఆనందంగా కుటుంబంతో కలిసి జరుపుకోవాలని, పేలుడు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి పేలుడు పదార్థాలు నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు సూచించారు. పేలుడు పదార్థాలను కలిగి ఉండడం గానీ అమ్మడం గాని నిర్వహించరాదని, ఎవరైనా అక్రమంగా నిల్వ ఉంచినా, అమ్మకాలు కొనసాగించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



తడిచిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం కల్పించిన భరోసా ఎక్కడని మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. తుఫాన్ నేపథ్యంలో తడిసిపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో తుఫానుల వల్ల భారీ వర్షానికి మొక్క జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో దళారులకు అతి తక్కువ రేటుకు అమ్ముకొని నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 100 కేజీలు రూ .2400 గాను కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో కూడా కొనుగోలు చేయని పరిస్థితి ఉందని అన్నారు. దీంతో దళారులు రూ.1700 నుంచి రూ.1900 వరకు కొంటున్నార న్నారు. కావున ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సత్తిబాబు, కన్నబాబు, తిరుపతి పాల్గొన్నారు.

కిలో వెండి వస్తువుల వితరణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు, శోభ దంపతులు ఆదివారం స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి రూ.1.80లక్షలు విలువ చేసే వెండి గిన్నె, పళ్లెం వితరణగా అందజేశారు. సన్యాసిరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిలో వెండి వస్తువులను ఆలయ ఇఒ ఎస్ నానాజీబాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బలగ రామారావు, వలి రెడ్డి రవీందర్ నాయుడు, సూరుకుమార్, ఎస్‌విజీ శ్రీనివాసరావు, సూరు వెంకటేష్, ఉరిటి రమణ, పొట్నూరు నర్సింగరావు, గద్దె అనురాగ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.